


పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

రాయికోడ్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాయిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ సస్పెన్షన్‌కు గురయ్యారు. పంచాయతీ కార్మికుల మూడు నెలల వేతనాన్ని తన సొంత ఖర్చులకు వాడుకున్నాడన్న ఆరోపణలొచ్చాయి. దీంతో జహీరాబాద్ డీఎల్‌పీవో విచారణ చేపట్టి నివేదిక జిల్లా అధికారులకు అందజేశారు. ఈ మేరకు జిల్లా అధికారులు అనిల్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్వర్వులు జారీ చేశారు.



హవేళిఘణపూర్ : పోచారం ప్రాజెక్టు

గత 24 గంటల్లో వర్షపాతం(మి.మీలలో)	
నర్సాపూర్	62.0
పాపన్నపేట	58.0
మాసాయిపేట	49.8
వెల్దురి	45.8
శివంపేట	43.3
నిజాంపేట	43.3
కొల్చారం	41.0

అలుగు దుంకిన ఆనందం

మెదక్ జిల్లావ్యాప్తంగా అలుగులు పారుతున్న 1500 చెరువులు

మెదక్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు మెతుకుసీమ రైతాంగం ఆనందంలో మునిగిపోయింది. వాగులు, వంకలు, పొంగిపొర్లుతూ చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 2632 చెరువుల్లో ఇప్పటికే 1531 అలుగు పారుతున్నాయి. ఈ సీజన్ సాగుకు అవసరమైన నీరు ఉన్నదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పాక్షికంగా నిండినవి..

జిల్లాలో మరో వైపు 586 చెరువుల్లో 75 నుంచి 100 శాతం వరకు మాత్రమే నిండాయి. మరో 351 చెరువులకు 50 నుంచి 75 శాతం, 125 చెరువుల్లో 25 నుంచి 50 శాతం మాత్రమే నీరు చేరినట్లు నీటిపారుదల అధికారులు పేర్కొన్నారు. ఇంకో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు పడితే ఇవికూడా నిండే అవకాశముందని తెలిపారు.



అలుగుపారుతున్న రాయిన్‌పల్లి చెరువు

ఈ మండలాల చెరువులకు చేరని నీరు..

మెదక్, హవేళీఘనపురం మండలాలలోని పలు చెరువుల్లో పాతిక శాతం కూడా నీరు చేరలేదని జిల్లా ఇరిగేషన్ అధికారులు తెలిపారు. వారం రోజుల క్రితం జిల్లాలో వర్షాల జాడే లేదని కేవలం రెండు, మూడు రోజులుగా పడుతున్న వానలకు చెరువులు జలకళతో ఉట్టిపడుతున్నాయని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం హవేళీఘనపురం మండలంలో 17 చెరువులు, మెదక్ మండలంలో 19 చెరువుల్లో 25 శాతం లోపే నీరు చేరిందని వివరించారు.



కౌడిపల్లి మండలం తునికిలోని ఖలీల్ సాగర్ చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● మెదక్ కలెకర్ రాహుల్ రాజ్

కౌడిపల్లి/శివ్వంపేట, ఆగస్టు (ఆంధ్రజ్యోతి) 19: భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తునికి ఖలీల్‌సాగర్ చెరువును ఆయన సందర్శించారు. శిథిలావస్థకు చేరిన ఇళ్ల నివాసితులు పంచాయతీ కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే శివ్వపేంట మండలం వెల్దుర్తి ఉసిరికపల్లి రోడ్డు పోతులబోగుడ వద్ద కొట్టుకపోయిన రోడ్డును, గుండ్లపల్లిలో పబ్బన్న కుంట కట్టను పరిశీలించారు. వెంటనే రోడ్డును పునరుద్ధరించాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్లు, ఆర్ఐల ఉన్నారు.

వనదుర్గా ప్రాజెక్టును పరిశీలించిన ఎస్పీ

పాపన్నపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు, వరదలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సాయంత్రం ఏడుపాయల ఆలయం, వనదుర్గా ప్రాజెక్టు వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించారు. ఆలయం, ప్రాజెక్టు, నదీపాయల వైపు ఎవరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సీఐ రాజశేఖర్ రెడ్డి తదితరలు ఉన్నారు



పాపన్నపేట : ఏడుపాయలలో వరదలను పరిశీలిస్తున్న మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు

సదాశివపేట ప్రజలకు రోజూ 2 గంటలు

మంజీరా నీరు సరఫరా చేయాల్సిందే

● మంజీరా నీటి కోసం రూ.200 కోట్లయినా సరే సీఎం రేవంత్‌రెడ్డిని అడిగి నిధులు తెస్తా

● మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారుల సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సదాశివపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో సెక్రటేరియట్‌లో మంజీరా నీటి సరఫరాపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు.



● మిషన్ భగీరథ పైప్‌లైన్లు తరచూ డ్యామేజ్ కావడం, రోజుల తరబడి మరమ్మత్తులు జరగడంతో సదాశివపేట మున్సిపల్ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు వస్తున్నాయి.

● సదాశివపేట మున్సిపాలిటీకి సరిపడా నీరు రావడం లేదు. సింగూర్ ప్రాజెక్టు నుంచి పటాన్‌చెరు వరకు మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉంది. పటాన్‌చెరుకు మంజీరా నీళ్లు వదిలితేనే సదాశివపేటకు మంజీరా నీళ్లు వచ్చే పరిస్థితి.

● ఇక ఈ పరిస్థితి ఉండొద్దు.. కేవలం సదాశివపేట పట్టణానికే సపరేటు మంజీరా పైప్‌లైన్ వేయండి.

● ఇందుకోసం ఇంటెక్‌వెల్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు, ఫిల్టర్ బెడ్‌లు నిర్మించండి.

● సదాశివపేట మున్సిపాలిటీలో కొత్త కాలనీలు వచ్చాయి. జనాభా కూడా పెరిగింది. రాబోయే 50 ఏళ్లకు జనాభాను లెక్క వేసి "డీపీఆర్" తయారు చేయండి.

● సదాశివపేట మండలం ఏటిగడ్డసంఘం గ్రామం వద్ద ఫిల్టర్‌బెడ్, సదాశివపేట శివారులో ఇంటెక్‌వెల్ ఏర్పాటు చేయాలి.

● ఏటిగడ్డసంఘం బదులుగా నేరుడి సింగూర్ నుంచి నీటిని తరలిస్తే ఉపయోగంగా ఉంటుంది. అందుకు అనుగుణంగా ప్రణాళికలు చేయాలి.

● మిషన్‌భగీరథ ద్వారా కాకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వయంగా మంజీరా నీటి సరఫరా జరగాలి.

● మూడు కాలనీలకు ఇక ట్యాంక్ చొప్పున ఆరు లక్షల గ్యాలన్ల కెపాసిటీతో ఏర్పాటు చేయాలి.

● జనాభాకు అనుగుణంగా 11 ట్యాంక్‌ల నిర్మాణం చేయాలని జగ్గారెడ్డికి తెలిపిన అధికారులు.

● ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం 2 గంటల చొప్పున మంజీరా నీరు రావాలి. ఫస్ట్‌ఫ్లోర్‌కు సైతం నీరు ఎక్కేలా ప్రెషర్‌తో నీరు సరఫరా చేసేలా కొత్త ట్యాంక్‌లు, పైప్‌లైన్ డిజైన్ చేయాలి.

● ఒక ప్రైవేటు కన్సల్టెంట్‌ను ఏర్పాటు చేసుకుని ప్రణాళికలు డిజైన్లు చేయండి ఆ ఖర్చు తాను భరిస్తానని జగ్గారెడ్డి తెలిపారు.

● ఇప్పుడున్న తక్కువ ప్రభుత్వ సిబ్బందితో డిజైన్ చేయలేరు కాబట్టి ప్రైవేటు కన్సల్టెంట్‌ను నియమించుకోవాలి.

● సదాశివపేటలో అవసరమైన చోట పాత ట్యాంక్‌లు, డిస్ట్రిబ్యూషన్‌లైన్ల స్థానంలో కొత్తది ఏర్పాటు చేయండి.

● సదాశివపేట ప్రజలకు మంజీరా నీటి కోసం రూ.200 కోట్లయినా సీఎం రేవంత్‌రెడ్డిని అడిగి నిధులు తెస్తానని జగ్గారెడ్డి తెలిపారు.

జిన్నారం, జంగంపేటల మధ్య పెద్దవాగు వరద ఉధృతితో రహదారిని మూసివేసిన అధికారులు



కల్హేర్ మండలం జంలాతండా సమీపంలో నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువకు పడిన గండి



తడిసిముద్దయిన మెతుకుసీమ

మొన్నటివరకు సరిగా వర్షాలు లేక వట్టిపోయిన మెతుకుసీమ నేడు భారీ వర్షాలతో తడిసిముద్దయింది. నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు మెదక్ జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో కొన్ని గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వరద నీరు వచ్చి చేరుతుండడంతో వందల చెరువులు నిండుకుండల్లా మారి అలుగులు పోస్తున్నాయి. ఈ వానలతో పంటలకు మేలు జరుగుతుందని అన్నదాతల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

● మొన్నటి వరకూ కరుణించని వరుణడు ● ఇప్పుడు ఏకధాటిగా వానలు

● పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు ● పలుచోట్ల నేలమట్టమైన ఇళ్లు

మెదక్ కల్చరల్/హవేళిఘణపూర్/జిన్నారం/రామాయంపేట/ చిన్నశంకరంపేట/కల్హేర్ ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మెదక్, మండల వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ర్యాలమడుగు చెక్‌డ్యాం నిండుకుండను తలపిస్తుండగా, రాయన్ పల్లి, బంగ్లా, తదితర చెరువులు అలుగు పారుతున్నాయి. హవేళిఘణపూర్ మండలంలోని పోచారం ప్రాజెక్టు, కూచన్‌పల్లి, సర్దన చెక్డ్యాంలు, చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. మంజీరా నది పరివాహకంలో 50 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. జిన్నారం రాయుని చెరువు పూర్తిగా నిండి పెద్దవాగు పొంగిపొర్లడంతో జిన్నారం, జంగంపేట, అన్నారం, వావిలాల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రోడ్డుకు రెండు వైపులా రెవెన్యూ అధికారులు, ముళ్ల కంపలు, ట్రాక్టర్ ట్రాలీలు అడ్డుపెట్టి రక్షణ చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు, కార్మికులు, విద్యార్థులు ఇతర మార్గాల్లో వెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. రామాయంపేటలోని పలు కాలనీలు

- మిగతా 8వ పేజీలో



రామాయంపేట తహసీల్దార్ కార్యాలయం లోపల ఉరుస్తున్న నీటి కోసం పెట్టిన బేసిన్లు



టేక్మాల్ : ఉధృతంగా ప్రవహిస్తున్న గుండువాగు

కూలిన ఇళ్లు

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మెదక్, సంగారెడ్డి జిల్లాలోని పలు ఇళ్లు కూలిపోయాయి. దీతో బాధిత కుటుంబ సభ్యులకు నిలువ నీడ లేకుండా పోయింది. సమాచారం అందుకున్న అధికారులు సదరు ఇళ్లను సందర్శించి వివరాలు సేకరించారు. జోగిపేటలోని ఎస్సీ కాలనికి చెందిన జోగ్యల్ల అనుసుజ, శంకర్ దంపతుల ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. నర్సాపూర్ మండలంలో 26 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కౌడిపల్లి మండల పరిధిలోని మహ్మద్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం, కంచన్‌పల్లిలోని గ్రామ పంచాయతీ భవనాల స్లాబ్‌లు పెచ్చులు ఊడి కిందపడ్డాయి. హవేళిఘణపూర్ మండలంలో 8 ఇండ్లు కూలినట్లు తహసీల్దార్ సింధురేణుక తెలిపారు. టేక్మాల్ మండలవ్యాప్తంగా 18 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు.



పెచ్చులూడిన కంచన్‌పల్లిలో జీపీ భవనం

రేషన్ కోసం ప్రత్యేక బ్యాగులు

● సంగారెడ్డి జిల్లాకు చేరిన 4,12,411 బ్యాగులు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుదారులకు సన్నబియ్యంతో పాటు వచ్చే నెల నుంచి ప్రత్యేక బ్యాగులు ఇవ్వనున్నారు. ఇప్పటికే మూడు నెలల సన్న బియ్యాన్ని ఒకే సారి పంపిణీ చేసిన ప్రభుత్వం.. సెప్టెంబరు నుంచి యథావిధిగా పంపిణీ చేసే రేషన్ బియ్యంతో పాటు ఉచితంగా బ్యాగులు ఇవ్వనుంది. పర్యావరణ హితం కోసం వస్త్రంతో తయారు చేసిన బ్యాగులను రేషన్ కార్డుదారులకు ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నది. రేషన్ కార్డు హోల్డర్‌కు ఒకటి చొప్పు పంపిణీ చేస్తారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల పథకాలను ప్రస్తావిస్తూ అందరికీ సన్న బియ్యం అందజేయడమే తమ లక్ష్యం అనే నినాదంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఫొటోలను బ్యాగుపై ముద్రించారు. జిల్లాకు 4,12,411 బ్యాగులు వచ్చాయని సివిల్ సప్లై సంగారెడ్డి జిల్లా మేనేజర్ అంబదాస్‌రాజేశ్వర్ తెలిపారు.



చిద్రుప్ప సబ్ సెంటర్‌కు 'ఎన్‌క్వాస్' అవార్డు

● 87.01 శాతం స్కోర్‌తో జాతీయ నాణ్యతా ప్రమాణాలకు ఎంపిక

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : కంది మండలంలోని చిద్రుప్ప గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్(హెల్త్ సబ్ సెంటర్) జాతీయ నాణ్యతా ప్రమాణాలకు(ఎన్‌క్వాస్-నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్) ఎంపికైంది. ఎక్స్‌టర్నల్ అసెస్‌మెంట్‌లో భాగంగా గత నెల 26న సబ్ సెంటర్‌ను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించారు. వర్చువల్‌గా 12 అంశాలను సుదీర్ఘంగా పరిశీలించగా మంగళవారం ఫలితాలు వెల్లడించారు. ఈ సెంటర్‌కు 87.01 స్కోర్ ఇచ్చి జాతీయ నాణ్యత ప్రమాణాలకు ఎంపిక చేశారు. ఎన్‌క్వాస్ అవార్డు పొందిన చిద్రుప్ప సబ్ సెంటర్‌కు ప్రోత్సాహక నగదు దక్కనుంది.



ఎన్‌క్వాస్ అసెస్‌మెంట్ రోజున చిద్రుప్ప సబ్ సెంటర్ వైద్య సిబ్బంది(ఫైల్)

సజావుగా రెండో విడత జ్వర సర్వే

● సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండో విడత జ్వర సర్వే సజావుగా సాగుతున్నదని సంగారెడ్డి డీఎంహెచ్‌వో డా.నాగనిర్మల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న సర్వే ప్రారంభం కాగా, ఇప్పటివరకు 96,782 ఇళ్లను సందర్శించి 3,88,882 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి మందులు అందజేసినట్లు తెలిపారు. జూలై 1 నుంచి ఆగస్టు 6 వరకు నిర్వహించిన మొదటి విడత ఫీవర్ సర్వేలో 4,21,919 ఇళ్లలోని 1,27,853 మందికి పరీక్షలు చేసి, 4216 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 77 డెంగీ కేసులు నమోదయ్యాయని, ఆందోళన పడొద్దని స్వీయ జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని పేర్కొన్నారు.

అందుబాటులోకి మొబైల్ ఫోరెన్సిక్ వాహనం

మెదక్ అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నేరం జరిగిన ప్రాంతాల్లో సమర్థవంతంగా, వేగవంతంగా సాక్ష్యాధారాలు సేకరించేందుకు వీలుగా ప్రభుత్వం జిల్లాకు మొబైల్ ఫోరెన్సిక్ వాహనం కేటాయించిందని జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆ వావానాన్ని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరం జరిగిన ప్రదేశంలో వేలి, కాలిముద్రలు, నార్కోటిక్, పేలుడు పదార్థాలు, ఇతర అన్ని రకాల ఆధారాలను విచారణ అధికారులు మరింత వేగంగా, అత్యాధునిక పద్ధతుల్లో సేకరించేందుకు మొబైల్ ఫోరెన్సిక్ వాహనం ఉపయోగపడుతుందన్నారు. ఈ వాహనంలో ప్రత్యేకంగా శిక్షణ పొందిన సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు. వాహనానికి ప్రత్యేక కెమెరా, ఫ్రిడ్జ్, మోడ్రన్ లైట్లు, డిజిటల్ పరికరాలు తదితర సాంకేతిక పరమైన టూల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. విపత్కర కేసుల ఛేదనలో మొబైల్ ఫోరెన్సిక్ వాహనం కీలకంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్ డీఎస్పీ రంగనాథ్, తదితరులు పాల్గొన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండపాల నిర్వాహకులు ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. వినాయక చవితి, ఈద్ మిలాద్ ఉన్ నబీ పండుగలను పురస్కరించుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అన్ని మండల కేంద్రాల్లో వివిధ మతాలకు చెందిన పెద్దలతో పీస్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎస్‌హెచ్‌ఓలు ప్రతి మండపాన్ని ప్రత్యక్షంగా సందర్శించి భద్రతపరమైన ఏర్పాట్లను పరిశీలించాలని, వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా వినాయక మండపాలు ఏర్పాటు చేసేలా చూడాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు తప్పనిసరి అని, లౌడ్ స్పీకర్లు, డీజేలకు అనుమతించకూడదని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలుంటాయని నిర్వాహకులకు చెప్పాలని పేర్కొన్నారు. మండపాల వద్ద మైకులు, స్పీకర్లను తక్కువ సౌండ్‌తో, రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించేలా చూడాలని, నిమజ్జనం రోజు చెరువుల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. పాతనేరస్థులను ముందస్తుగా బైండోవర్ చేయాలని, సమస్యలను సృష్టించే వారిపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే పుకార్లను నమ్మరాదని, ఫార్వార్డ్ మెసేజ్‌లపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కుల మతాలకు అతీతంగా, శాంతియుత వాతావరణంలో పండగను జరుపుకోవాలని ఎస్పీ కోరారు.

దుకాణంలో చోరీ

● రూ.20 వేల నగదు అపహరణ

సిద్దిపేట రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వ్యక్తులు ట్రేడర్స్ దుకాణం తాళం పగులగొట్టి నగదు అపహరించుకువెళ్లిన సంఘటన సోమవారం రాత్రి సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రాములు లక్ష్మీనరసింహ ట్రేడర్స్ దుకాణం నడిపించుకుంటున్నాడు. రోజులాగే రాత్రి దుకాణం తాళంవేసి ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం దుకాణం తీసేందుకు వెళ్లగా.. తాళం పగులగొట్టి షెటర్ తీసి ఉన్నది. లోపలికి వెళ్లి చూడగా గల్లాలోని నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

విద్యార్థుల సమస్యలు పట్టించుకోరా..?

● ప్రిన్సిపల్‌పై ఎమ్మెల్యే అసహనం
● గురుకుల పాఠశాలను సందర్శించిన సంజీవరెడ్డి




జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ ఉమాహారతి

నారాయణఖేడ్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : 'గురుకుల విద్యార్థుల ఒంటిపై దద్దుర్లు' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఆర్‌సీవో గౌతమ్‌రెడ్డి హుటాహుటిన నారాయణఖేడ్ శివారులోని జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో తిరిగి విద్యార్థుల స్థితిగతులు తెలుసుకొని అసహనం వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉందని, తాను గతేడాది పాఠశాలను సందర్శించిన సమయంలో ఫ్యాన్లు, లైట్లు లేకపోవడంతో దాతల సహకారంతో ఏర్పాటు చేయించానన్నారు. ఆర్‌వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలని సూచించినా చేయించలేదన్నారు. ఏడాది క్రితం నాటికీ, ఇప్పటికీ పరిస్థితుల్లో ఏ మార్పు లేదని, ప్రిన్సిపాల్‌పై ఆర్‌సీవో చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఇక్కడి విద్యార్థులకు ప్రతిరోజూ ఒకే రకమైన భోజనం వడ్డించడంతోనే అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపల్‌ను విధుల నుంచి తప్పించాలని ఎమ్మెల్యే ఆర్‌సీవోను ఆదేశించారు. అంతకుముందు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, మాజీ ఎంపీటీసీ పండరిరెడ్డి, ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు మాణిక్‌గౌడ్, శంకర్‌గౌడ్ ఉన్నారు. అలాగే గురుకుల పాఠశాలను సబ్ కలెక్టర్ ఉమాహారతి కూడా సందర్శించారు. 50 మందికి అంటువ్యాధులు ఉన్నట్లు గుర్తించి, చికిత్సలు అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

తల్లిదండ్రుల ఆందోళన

బీసీ గురుకులంలో విద్యార్థులు అంటువ్యాధులతో ఇబ్బందులకు గురవుతున్నా ప్రిన్సిపల్ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడని నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన చేశారు. ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు సతీష్, నాయకులు పాల్గొన్నారు.

గురుకులంలో తగ్గుముఖం పడుతున్న జ్వరాలు

● పాఠశాలను సందర్శించిన డీఎంహెచ్‌వో నాగనిర్మల



సింగూరు గురుకుల పాఠశాలను సందర్శిస్తున్న డీఎంహెచ్‌వో నాగనిర్మల

పుల్‌కల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : పుల్కల్ మండల సింగూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులు కోలుకుంటున్నారు. నాలుగైదు రోజుల క్రితం విద్యార్థులు జ్వరం బారినపడి అస్వస్థకు గురైన విషయం తెలిసిందే. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ సాయికిరణ్ అధ్వర్యంలో పాఠశాలలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి నాగనిర్మల మంగళవారం గురుకుల పాఠశాలను సందర్శించారు. చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. జ్వరాల బారినపడిన విద్యార్థులందరూ కోలుకుంటున్నారని, ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉన్నదని ఆమె తెలిపారు. విద్యార్థులందరికీ జ్వరాలు నయం అయ్యేంత వరకు వైద్యశిబిరం కొనసాగుతుందన్నారు. ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పులు, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సీజనల్ జ్వరాలు సోకాయన్నారు. సీజనల్ జ్వరాలను నివారణకు ప్రిన్సిపాల్ ఆగమయ్య, సిబ్బంది అప్రమత్తమై పాఠశాలలోనే పీహెచ్‌సీ డాక్టర్ సాయికిరణ్ సిబ్బందితో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు. అనంతరం భోజనశాలలో వసతులు, ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నారా అంటూ విద్యార్థులను అడిగారు. ఆహార పదార్థాలు తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. జ్వర బాధిత విద్యార్థులకు ప్రత్యేక గదులు కేటాయించి, తాగడానికి వేడి నీళ్లు, పాలు, బ్రెడ్‌తో పాటు ప్రత్యేక ఆహార పదార్థాలను అందజేస్తున్నారని డీఎంఎహెచ్‌వో నాగనిర్మల తెలిపారు. ఆమె వెంట పీహెచ్‌సీ డాక్టర్ సాయికిరణ్, పాఠశాల ప్రిన్సిపాల్ ఆగమయ్య, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఫిట్స్‌తో యువకుడి మృతి



మూడబోయిన స్వామి(ఫైల్)

చిన్నశంకరంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఫిట్స్‌తో యువకుడు మృతిచెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని ఎస్ కొండాపూర్ మధిర గ్రామం ప్యాటగడ్డలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మూడబోయిన స్వామి(20) మూడురోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు స్వామిని చికిత్స కోసం మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. డెంగీతో రక్త కణాలు తగ్గాయని వైద్యులు సూచించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ వెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు వైద్యాధికారి డాక్టర్ సాయిసింధు తెలిపారు. ఆసుపత్రిలో అన్నిరకాల టెస్టులు చేయించారు. గుండెపోటు సమస్య ఉందని, ఫిట్స్ వ్యాధి నిర్ధారణ అయ్యిందని వైద్యాధికారి వెల్లడించారు. స్వామి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

కాలుజారి బావిలోపడి వ్యక్తి..



రఘు(ఫైల్)

జహీరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు కాలుజారి బావిలోపడి వ్యక్తి మృతిచెందాడు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం చిరాగ్‌పల్లికి చెందిన రఘు(40) ఈనెల 18న సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇంట్లోంచి వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాకపోవడంతో భార్య మీనాక్షి చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావివద్ద బురదలో ఉన్న చెప్పులను గమనించారు. బావిలో దూకాడేమోనని అనుమానంతో పాతాళగడితో బావిలో వెతకగా మృతదేహం కనిపించిందన్నారు. కాలకృత్యాలకు వెళ్లి కాలుజారి పడ్డాడని భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు..

చేగుంట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన చేగుంట మండల పరిధిలోని రెడ్డిపల్లి వడ్డెర కాలనీలో ఆదివారం చోటుచేసుకుంది. కాలనీవాసులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన ఉప్పు కార్తీక్(22) ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కలవారు గమనించిన కుటుంబసభ్యులకు సమాచారమందించారు. ఇంటికి చేరుకున్న వారు మృతదేహాన్ని కిందికి దించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కార్తీక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డిని సంప్రదించగా.. కార్తీక్ మృతికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని వెల్లడించారు.

అప్పులు తీర్చలేక యువకుడి ఆత్మహత్య

జహీరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : అప్పులు తీర్చే మార్గం లేక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ధనసిరి గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేకుంది. చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పరుశరాం(21) మహిళా సంఘాల్లో అప్పులు తీసుకుని సోదరి వివాహం చేశాడు. కూలీ పనులు చేసుకుంటూ దఫాలవారీగా అప్పులు చెల్లిస్తున్నాడు. ఇంకా మిగిలిన అప్పులను ఎలా తీర్చాలనే బెంగతో సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కుంచికన్నె నర్సప్ప మంగళవారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి..

ఝరాసంగం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఉరేసుకుని గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కుప్పానగర్ గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ పాటిల్ క్రాంతి కుమార్ వివరాల ప్రకారం.. కుప్పానగర్‌లోని ఓ పాడుబడిన దాబాలో 30 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు. మృతుడికి సంబంధించిన వారెవరైనా ఉంటే 8712656771 నంబరుకు ఫోన్‌చేసి తెలపాలని ఆయన కోరారు.

పొగచూరుతున్న బతుకులు



కేంద్రమంత్రి కార్మిక శాఖ మంత్రి మనసుక్‌మాండవ్యను సన్మానించిన అనంతరం వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్

- చేతి నిండా పని లేదు.. చేయూత అందదు
- దిక్కుతోచని స్థితిలో బీడీ కార్మికులు

దుబ్బాక, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని వేలాది మందికి ఉపాధి మార్గమైన బీడీ పరిశ్రమ సంక్షోభంలో పడిపోవడంతో కార్మికుల పరిస్థితి దిక్కుతోచకుంది. చేసేందుకు చేతి నిండా పని లేక.. ప్రభుత్వం నుంచి చేయూత అందక ఎవరి చెప్పుకోవాలో తెలియని స్థితిలో పడిపోయారు. కరువు నేలగా పేరుతెచ్చుకున్న ఉమ్మడి మెదక్ జిల్లాలో సగం గ్రామాలు బీడీ పరిశ్రమనే నమ్ముకుని పని చేసేవి. ఇప్పటికీ ఉమ్మడి జిల్లాలో సుమారు 84 వేల మంది బీడీ పరిశ్రమలో వివిధ పనులు చేస్తూనే ఉన్నారు. వీరి సంక్షేమం కోసం అటు ప్రభుత్వాలు కొత్త పథకాలు తీసుకువస్తున్నా అవి వారికి అందని ద్రాక్షలుగానే మారుతున్నాయి. ఇక కార్మిక సంఘాలు సైతం ప్రభుత్వాలపై, యాజమాన్యాలపై వివిధ రూపాల్లో ఒత్తిడి తీసుకువస్తూనే ఉన్నారు. సిద్దిపేట జిల్లాకు చెందిన భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు కలాల్ శ్రీనివాస్ మంగళవారం కేంద్ర మంత్రి మనసుక్ మాండవ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

అందని పథకాలు..

వలసలతో విలవిలలాడిన పాత మెదక్ జిల్లాలోని సగం గ్రామాలు బీడీ పరిశ్రమే ఆధారంగా ఉండేది. అందరు కార్మికుల్లానే బీడీ పరిశ్రమలో పని చేసే వారికి గ్రాట్యూటీ, పీఎఫ్, ఈఎస్ఐ వంటి కార్మిక సంక్షేమ పథకాలు, చట్టబద్ధ సౌకర్యాలు అందజేయాల్సి ఉంటుంది. బీడీ పరిశ్రమలోని కొందరు కార్మికులకు ఈ పథకాలు అందడం లేదు. నాలుగు దశాబ్దాలుగా ఈ పరిశ్రమను నమ్ముకుని బతుకుతున్న కార్మికులను ఆదుకోవాలనే ఉద్దేశంతో 2014 కంటే ముందు పీఎఫ్ ఉన్న కార్మికులకు జీవనభృతిని అందించింది. ఒక్క సిద్దిపేట జిల్లాలోనే సుమారు 72 వేల మంది పీఎఫ్, నాన్ పీఎఫ్ కార్మికులు ఉన్నారు. ఇందులో 44వేల 473 మంది కార్మికులకు, 276 మంది టేకేదారులకు జీవనభృతి పొందుతున్నారు. మిగిలిన వారికి ఈ పథకం అందడం లేదు. ఇతర పథకాల సంగతి ఇక చెప్పాల్సిన పనేలేదు.

డేంజర్ గుర్తుతోనే ప్రమాదంలోకి..

బీడీ కట్టలపై డేంజర్ గుర్తులు పెట్టాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించడంతోనే పరిశ్రమ పూర్తిగా ప్రమాదంలో పడిపోయింది. కంపెనీ పేరు, ట్రేడ్ మార్క్ కూడా కనబడకుండా డేంజర్ గుర్తులే ప్రధానంగా ఉండాలనడం, ఏటా ఈ గుర్తులు మారుతుండటంతో మార్కెట్ పూర్తిగా తగ్గింది.

జీఎస్టీ శరాఘాతం

బీడీ పరిశ్రమ ముడి సరుకుపై, బీడీ ఉత్పత్తులపై జీఎస్టీ కూడా కార్మికుల ఉపాధిని దెబ్బతీసింది. వీటిపై 28 శాతం జీఎస్టీ విధించారు. వెయ్యి బీడీలు రూ.1,000కి అమ్మితే అందులో నుంచి రూ.280 జీఎస్టీ కింద చెల్లించాల్సి వస్తుంది. ఒకవేళ 1000 బీడీలు రూ. 900లకు మార్కెట్లో అమ్మితే అందులో రూ. 248 జీఎస్టీ కింద కట్టాల్సి ఉంటుంది. ఇలా వసూలు చేస్తున్న జీఎస్టీ నుంచి పరిశ్రమ కోసం, బీడీ కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేసేది నామమాత్రమే. ఇదంతా ఒకేత్తయితే, కార్మికులు పోరాడి సాధించుకున్న బీడీ, చుట్ట కార్మికుల చట్టం-1966తో పాటు 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. ఈ నాలుగు లేబర్ కోడ్‌లు వలన కార్మికుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.



బీడీ కార్మికులు

చాలీచాలని పెన్షన్

బీడీ కార్మికులు అనేక ఆరోగ్య సమస్యలను లెక్కచేయకుండా పని చేసినా రిటైర్‌మెంట్ అనంతరం ఇస్తున్న పెన్షన్ వారికి ఏ మూలకూ సరిపోవడం లేదు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నెలకు కనీసం రూ. 10 వేల పెన్షన్ ఇవ్వాలని కార్మిక సంఘాలు పోరాటం చేస్తున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు. ఇక పీఎఫ్, ఈపీఎఫ్ ద్వారా జమ చేసిన డబ్బులు కూడా సకాలంలో చెల్లించడం లేదు.

సంక్షేమంలోనూ కోతలు

బీడీ కార్మికులకు అరకొరగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలూ సరిగ్గా అందడం లేదు. జీవనభృతిని పెంచుతామని ఇచ్చిన హామీ నీటిమూటగానే మారింది. ఇక కేంద్ర ప్రభుత్వం బీడీ కార్మికుల కోసం విడుదల చేసిన నిధులను గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మళ్లించింది. ప్రస్తుతమూ ఇలాగే మళ్లించారు. బీడీ కార్మికులకు ప్రత్యేకమైన ఇళ్లు కేటాయించడం లేదు. గతంలో బీడీ కార్మికులు సొంత ఇల్లు నిర్మించుకుంటే కేంద్ర కార్మిక సంక్షేమ శాఖ నుంచి రుణాలు అందేవి. అవి పూర్తిగా నిలిపివేశారు. డిస్పెన్సరీ హాస్పిటల్స్ ద్వారా సంచార వాహనాలను ఏర్పాటు చేసి, బీడీ కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందించేవారు. ఇప్పుడా విషయాన్ని మర్చిపోయారు.

జిల్లాలో మొదటి మొబైల్ సైన్స్ ల్యాబ్

- ఖేడ్‌లో ప్రారంభించిన ఎమ్మెల్యే సంజీవరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే మొదటి మొబైల్ సైన్స్ ల్యాబ్ నారాయణఖేడ్‌లో మంగళవారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే సంజీవరెడ్డి... డీఈవో వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డిలతో కలిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దీనిని ప్రారంభించారు. సబ్ కలెక్టర్ ఉమాహారతి మొబైల్ సైన్స్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ పాఠ్య పుస్తకాల్లో చదవడంతో పాటు ప్రయోగాల ద్వారా నైపుణ్యం పెంపొందించుకుకోగలుగుతామన్నారు. మొబైల్ సైన్స్ ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖేడ్ భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు పరికరాల కోసం గుర్తింపు శిబిరం నిర్వహించగా ఎమ్మెల్యే పాల్గొన్నారు.

బోధన తీరును పరిశీలించిన డీఈవో

ఖేడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈవో వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా ఓ ఉపాధ్యాయుడు పాఠం చెబుతుండగా, విన్నారు. ఆయన వెంట మండల విద్యాధికారి విశ్వనాథ్ ఉన్నారు.

పత్తి పంటలో గంజాయి సాగు



శ్యామనాయక్‌తండాలో పత్తి పంటలో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

నాగల్‌గిద్ద, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గుట్టుచప్పుడు కాకుండా పత్తి పంటలో సాగుచేస్తున్న 105 గంజాయి మొక్కలను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని శ్యామనాయక్ తండాకు చెందిన పీర్‌నాయక్ తన వ్యవసాయ భూమిలో అంతర పంటగా గంజాయి మొక్కలు సాగుచేస్తున్నాడని సమాచారం వచ్చింది. జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు హరికిషన్, మానెకమ్మల ఆదేశాల మేరకు డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు మంగళవారం పీర్‌నాయక్ పత్తి పంటలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా 105 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ శంకర్, ఎస్ఐలు హన్మంతు, అనుదీప్, సిబ్బంది అరుణజ్యోతి, పండరి, రాజేష్, శివక్రిష్ణ పాల్గొన్నారు.

హారన్ కొట్టినా సైడ్ ఇవ్వలేదని..

- ఆర్టీసీ డ్రైవర్‌పై ఆటోవాలాలా దాడి

పటాన్‌చెరు ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): హారన్ కొట్టినా సైడ్ ఇవ్వలేదని ఓ ఆర్టీసీ డ్రైవర్‌పై ఆటోవాలాలు దాడి చేశారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఎస్సై సుభాష్ కథనం ప్రకారం.. మియాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును గీతం వర్సిటీ అద్దెకు తీసుకున్నారు. రోజూ వర్సిటీ విద్యార్థులు ఆ బస్సులో వర్సిటీకి వెళ్తారు. మంగళవారం ఉదయం విద్యార్థులను ఎక్కించుకుని రుద్రారంలోని గీతం వర్సిటీ వద్ద డ్రాప్ చేశారు. ఉదయం 9 గంటల సమయంలో బస్సు తిరుగు ప్రయాణం అవుతుండగా, వెనుక నుంచి వచ్చిన ఆటోవాలా హారన్ కొట్టాడు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రభాకర్ బస్సును పక్కకు జరపకపోవడంతో వెనుక నుంచి హారన్ కొడుతూ వచ్చారు. ముందు యూటర్న్ ఉండటంతో ఆర్టీసీ బస్సు ఆపాడు. ఆ క్రమంలో వచ్చిన ఆటోవాలా వడ్డే జైపాల్, వడ్డే మహేష్‌లు ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేశారు. ఈ మేరకు ఆర్టీసీ డ్రైవర్ ప్రభాకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చేపల వలలో చిక్కిన కొండచిలువ



వలకు చిక్కిన కొండచిలువ

నర్సాపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ రాయరావు చెరువు అలుగు పారుతుండటంతో మత్స్యకారులు చేపల కోసం వలలు వేశారు. అటవీ ప్రాంతం నుంచి వరదలో కొట్టుకువచ్చిన భారీ కొండచిలువ వలలో చిక్కింది. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. ఎఫ్ఆర్‌వో అరవింద్, సెక్షన్ అధికారి సాయిరాం, బీట్‌అధికారి గోపాల్‌రెడ్డి స్నేక్ సొసైటీ వారి సహకారంతో వలలో కొండచిలువను బయటకు తీసి సంరక్షణ కేంద్రానికి తరలించారు.

రాజన్న సేవలో కేసీఆర్ సతీమణి



కేసీఆర్ సతీమణి శోభకు చిత్రపటం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామిని మాజీ సీఎం కేసీఆర్ సతీమణి కల్వకుంట్ల శోభ దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం ఆలయానికి మనుమడు హిమాన్షుతో (కేటీఆర్ తనయుడు) కలిసి వచ్చిన ఆమెకు బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి పూలమొక్కలు అందజేశారు. అనంతరం రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లగా అర్చకులు స్వాగతం పలికారు. రాజరాజేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయాధికారులు రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

విద్యాధరి క్షేత్రం నిర్వహణ అద్భుతంగా ఉంది

- కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీస్వామిజీ



విజయేంద్ర సరస్వతీస్వామివారిని కలిసిన చంద్రశేఖరశర్మ సిద్ధాంతి, సభ్యులు

వర్గల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ కేంద్రంలో కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాధరి క్షేత్రం నిర్వహణ అద్భుతంగా ఉన్నదని కంచి పీఠాధిపతులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీస్వామిజీ కొనియాడినట్లు వర్గల్ విద్యాధరి క్షేత్రం వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి తెలిపారు. మంగళవారం తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలోని మహాపాదుకా కంచి మఠంలో చతుర్మాస్య దీక్షలో ఉన్న విజయేంద్ర సరస్వతీ స్వామిని చంద్రశేఖరశర్మ సిద్ధాంతి, ఆలయ అభివృద్ధి సభ్యులు కలిసి ఆశీస్సులు పొందారు. విద్యాధరిలో సెప్టెంబరు 22 నుంచి ప్రారంభంకానున్న విద్యా సరస్వతీ అమ్మవారి శరన్నవరాత్రోత్సవాలకు అనుమతి తీసుకోవడంతో పాటు వారిని ఆహ్వానించినట్లు తెలిపారు. అలగే కంచి పీఠం ఉత్తరాధికారి సత్య చంద్ర శేఖర సరస్వతీ స్వామివారి పరిచయ కార్యక్రమం నిర్వహించారని చెప్పారు. వర్గల్ విద్యాధరి క్షేత్రం వద్ద భక్తులకు చక్కటి వసతులను కల్పిస్తూ గొప్ప ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లాలని ఆకాంక్షించినట్లు సిద్ధాంతి తెలిపారు.

డీప్ ఫేక్, సైబర్ భద్రతపై 'గీతం'లో కార్యశాల

పటాన్‌చెరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం (సీఎస్ఈ) ఆధ్వర్యంలో 'సైబర్ భద్రతలో డీప్ ఫేక్ బెదిరింపులు- గుర్తింపు, నివారణ, నైతిక సవాళ్లు' అనే అంశంపై రెండువారాల అధ్యాపక వికాస కార్యక్రమాన్ని (ఎఫ్‌డీపీ) నిర్వహిస్తున్నారు. అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) శిక్షణ, అభ్యాసం (ఏటీఏఎల్) అడ్వాన్స్‌డ్ పథకం కింద ఏర్పాటు చేసిన ఈ కార్యశాలను ఐఐటీ హైదరాబాదు ప్రొఫెసర్ డాక్టర్ నరహరిశాస్త్రి లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక పరిజ్ఞానంలో భారతీయుల శక్తి, సామర్థ్యాలను ప్రముఖంగా ప్రస్తావించారు.

ముగిసిన సహస్ర అంత్యక్రియలు

- రెండు కుటుంబాల్లో విషాదఛాయలు



సహస్ర అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

మునిపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ కూకట్‌పల్లిలోని దయార్‌గూడలో ఓ బాలిక సహస్ర సోమవారం ఎవరో గుర్తు తెలియని దుండగులు హత్యచేసిన సంఘటన తెలిసిందే. కాగా మంగళవారం స్వగ్రామమైన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం ముక్తక్యాసారంలో బాలిక అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామానికి చెందిన క్రిష్ణ, రేణుక భార్యాభర్తలు. వీరికి ఒక కుమార్తె సహస్ర, కుమారుడు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు సహస్రను హత్యచేశారు. ఈ ఘటన ఇటు ముక్తక్యాసారం, అటు అమ్మమ్మ ఊరిలో విషాదాన్ని నింపింది. స్వగ్రామంలో బాలిక అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి. ఇదిలా ఉండగా బాధిత కుటుంబాన్ని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (డీసీపీవో) రత్నం, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ యాదగిరి, పీవో లింగం పరామర్శించారు.

గుట్టుచప్పుడు కాకుండా చెరువులోకి వ్యర్థ జలాలు

- చౌటకూర్ గణపతి డిస్టిలరీ నిర్వాహకం
- కాలుష్య జలాలను పరిశీలించిన ఆర్ఐ ప్రమోద్





పుల్‌కల్: చెరువులోకి వదిలిన వ్యర్థ జలాలను పరిశీలిస్తున్న ఆర్ఐ ప్రమోద్, జిల్లెలవాగు వద్ద సంప్‌లో వర్షపు నీటిలో కలిసి చేరుతున్న పరిశ్రమల వ్యర్థాలు

పుల్‌కల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : 'సందట్లో సడేమియా' అన్నట్లు ఓ పరిశ్రమ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థ జలాలను రాత్రివేళ చెరువు, కుంటల్లోకి విడుదల చేస్తున్నది. మండల కేంద్రమైన చౌటకూర్ సమీపంలో గల గణపతి పరిశ్రమకు చెందిన డిస్టిలరీ పరిశ్రను నెలకొల్పారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాది వద్ద గల గణపతి చక్కెర పరిశ్రమ నుంచి మొలాసిస్‌ను డిస్టిలరీ పరిశ్రమకు తరలించి స్పిరిట్‌ను తయారు చేస్తున్నారు. ఇందులో భాగంగా పరిశ్రమలో మొలాసిస్‌ను నిల్వచేశారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వరదనీరు ప్రవహిస్తుండటంతో ఆ ప్రవాహంలో మొలాసిస్ వ్యర్థ జలాలను సైతం వదులుతున్నారు. దీంతో పరిశ్రమ సమీపంలోని ఈదులకుంట, కోమటి చెరువుల్లోకి ప్రవహించి మంచి నీరంతా కలుషితమవుతున్నది. ఈ విషయమై రైతులు తహసీల్దార్ అనుదీప్‌కు ఫిర్యాదు చేశారు. కలుషిత వ్యర్థ జలాలను పరిశీలించి నివేదిక అందజేయాలని తహసీల్దార్ అనుదీప్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌కు సూచించడంతో ఆయన పరిశ్రమ వద్ద కలుషిత నీటిని పరిశీలించారు. నివేదికను తయారు చేసి తహసీల్దార్‌కు అందజేశారు.

వర్షపు నీటిలో కాలుష్య జలాలు

జిన్నారం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు కొన్ని రసాయన పరిశ్రమలకు కలిసి వచ్చాయి. వర్షపు నీటి ప్రవాహంలో గుట్టుచప్పుడు కాకుండా వ్యర్థాలను వదిలేస్తున్నారు. గడ్డపోతారం, కాజీపల్లి పారిశ్రామికవాడల మధ్య జిల్లెలవాగుపై నిర్మించిన సంప్‌లో రసాయన వ్యర్థాలు చేరాయి. అక్కడి నుంచి దిగువన ఉన్న కాజీచెరువు, గండిచెరువులోకి చేరుతున్నాయి. అదేవిధంగా బహిరంగ ప్రాంతాలు, కుంటల్లోనూ రసాయన జలాలు చేరడంతో ఆ ప్రాంతాలు సైతం కాలుష్యమయంగా మారాయి.

అక్షరాస్యులుగా మార్చడానికే ఉల్లాస్



కంది జడ్పీహెచ్ఎస్‌లో ఉల్లాస్ కార్యక్రమంలో సీఆర్పీలకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

కంది, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే ఉల్లాస్ కార్యక్రమ లక్ష్యమని టాస్ (తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ) ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం కంది జడ్పీహెచ్ఎస్‌లో ఉల్లాస్ నిర్వహించారు. ఇందులో కంది మండలంలోని అన్ని గ్రామాల ప్రధానోపాధ్యాయులకు, సీఆర్పీ (క్లస్టర్ రీసోర్స్ పర్సన్)లకు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర సహకారాలతో 15 ఏళ్ల పైబడిన వారిని మహిళా సంఘాల ద్వారా గుర్తించి వారికి చదువు నేర్పించేందుకు ఉల్లాస్ ద్వారా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కే.జోగప్ప, ప్రధానోపాధ్యాయురాలు ఎం.వెంకటలక్ష్మి, సీఆర్పీలు పాల్గొన్నారు.

యూరియా కోసం.. వర్షంలో సైతం..

- పొద్దున్నే కేంద్రాల వద్దకు పరుగులు
- గంటల తరబడి క్యూలో నిల్చున్న రైతులు



చేగుంట మండల కేంద్రంలో యూరియా కోసం భారీగా బారులుతీరిన రైతులు

దౌల్తాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రైతులను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. తెల్లారింది మొదలు.. యూరియా కోసం పరుగులు పెడుతున్నారు. పనులన్నీ వదులుకుని కుటుంబసమేతంగా వచ్చి గంటల తరబడి క్యూలో నిల్చున్నా యూరియా దొరకడం కష్టంగా మారింది. దౌల్తాబాద్ మండల కేంద్రంలోని మంగళవారం వర్షం సైతం లెక్క చేయకుండా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు.

●చేర్యాల: చేర్యాల మండలంలోని ఆగ్రోస్, గ్రోమోర్ కేంద్రాల వద్ద యూరియా కోసం రైతులు గంటల తరబడి వేచిచూశారు. కొరత లేకుండా వినియోగానికి సరిపడా సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

●అక్కన్నపేట: అక్కన్నపేట మండల కేంద్రంలోని ఆగ్రోస్ సెంటర్‌కు మంగళవారం ఒక్క లోడు యూరియా వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకుని వర్షంలో తడుస్తూ క్యూలో నిల్చుని యూరియా కోసం ఎదురుచూశారు. అయితే దుకాణాదారుడు ఒక్క రైతుకు రెండు బస్తాల చొప్పున టోకెన్లు ఇచ్చాడు. బుధవారం యూరియా పంపిణీ చేస్తామని చెప్పడంతో రైతులు వెనుదిరిగారు.

●చేగుంట: చేగుంట మండల కేంద్రంలో ఉదయం నుంచి రైతులు యూరియా కోసం క్యూలో నిల్చున్నారు. మంగళవారం చేగుంట మండలానికి 400 సంచులు యూరియా రావడంతో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, ఏఈవో మాధవి క్యూలో నిల్చున్న ప్రతీ రైతుకు ఒకటి చొప్పున అందజేశారు.

●నర్సాపూర్: నర్సాపూర్ మండలంలోని గ్రోమోర్ కేంద్రం వద్ద రైతులు యూరియా కోసం రైతులు కొనేందుకు ఎగబడ్డారు. పోలీసులు వచ్చి బందోబస్తు ఏర్పాటు చేయగా.. ఒక్కో రైతుకు 2 సంచులు ఇచ్చారు.

●నిజాంపేట: మండల కేంద్రమైన నిజాంపేటలో ఎరువుల లోడ్ వచ్చిన వెంటనే ఖాళీ అవుతోంది. మంగళవారం వర్షం కురుస్తున్నా రైతులు గంటల తరబడి యూరియా కోసం క్యూలో నిల్చున్నారు.

●చిన్నశంకరంపేట: చిన్నశంకరంపేట మండలంలోని సహకార సంఘం వద్ద యూరియా బస్తాల కోసం రైతులు బారులుతీరారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా తోపులాడుకుంటూ టోకెన్లు తీసుకున్నారు. పోలీసుల సమక్షంలో దుకాణాదారుడు యూరియా బస్తాలు అమ్మారు.

యూరియాతోనే కాంగ్రెస్‌కు ఉరి : ఎమ్మెల్యే



అక్బర్‌పేటలో చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి రాస్తారోకో చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు యూరియాను అందించడంలో పూర్తి నిర్లక్ష్యం వహిస్తుందని, రానున్నరోజుల్లో యూరియా బస్తాలే కాంగ్రెస్‌కు ఉరితాడుగా మారుతాయని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం మండల కేంద్రమైన అక్బర్‌పేట-భూంపల్లి చౌరస్తాలోని ఎన్‌హెచ్ 765 డీజీ జాతీయ రహదారిపై రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ మంత్రులకు రైతులపై పట్టింపులేదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో గ్రామగ్రామానికి యూరియాను సరఫరా చేశామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లకే రైతులు రోడ్లపైకి వచ్చి గంటల తరబడి యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వెంటనే రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏసీపీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకుని, అనంతరం విడిచిపెట్టారు. రాస్తారోకో అనంతరం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కూడవెల్లి వాగు పొంగిపొర్లడంతో వంతెన వద్ద పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రెండు అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

పటాన్‌చెరు ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరులో రెండు అనాథ మృతదేహాలకు ఎండీఆర్ ఫౌండేషన్ తరఫున అంత్యక్రియలు నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధురాలు మృతి చెందారు. అలానే కొల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యానికి బానిసగా మారి అస్సాం రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతదేహాన్ని తీసుకువెళ్లడానికి కుటుంబసభ్యులు ముందుకు రాకపోవడంతో సమాచారం అందుకున్న ఎండీఆర్ ఫౌండేషన్ ప్రతినిధి మధుసూదన్ అనాథ మృతదేహాలకు మంగళవారం అంత్యక్రియలు జరిపారు.

వసతి గృహాలు శుభ్రంగా ఉంచాలి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి) : వసతి గృహాలు శుభ్రంగా ఉంచాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ సూచించారు. సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 2025-26 విద్యాసంవత్సరానికిగాను వసతి గృహ సలహా సంఘం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహాల నిర్వహణ, పరిశుభ్రతపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘీక సంక్షేమ శాఖ అధికారి శంకర్, వసతి గృహ సంక్షేమాధికారులు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబా శతజయంతి వేడుకలు

జోగిపేట రూరల్, ఆగస్టు19, ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి శ్రీ సత్యసాయిబాబా వారి శతజయంతి వేడుకలు మంగళవారం జోగిపేటలో సత్యసాయి సేవాసమితి సభ్యులు నిర్వహించారు. జోగిపేటలోని విద్యాజ్యోతి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముందుగా సత్యసాయిబాబా వారి ఫొటోకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 100రోజుల ప్రణాళికలో భాగంగా 104 మంది విద్యార్థులకు మానవతా విలువలకు సంబంధించిన తరగతులను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

పండగలను శాంతియుతంగా జరుపుకోండి

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పండుగలను ప్రశాంతంగా, శాంతియుతంగా జరుపుకోవాలని సంగారెడ్డి డీఎస్పీ కె.సత్తయ్యగౌడ్ కోరారు. రానున్న వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగల సందర్భంగా సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నాడు శాంతి కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో సంగారెడ్డి పట్టణ సిఐ రమేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చుకుదాం: ఎంఈవో

కొండాపూర్,ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అక్షరాస్యతలో సమున్నత స్థానంలో నిలిపేందుకు మహిళా సంఘాల సభ్యులు, యువత, ఉపాధ్యాయుల కృషి అవసరమని ఎంఈవో దశరథ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రామైన కొండాపూర్ ఉన్నత పాఠశాలలో నవ భారత సాక్షరతపై ఉల్లాస్ సోసైటీ(అండర్ స్టాడింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ సోసైటీ)అర్హత,బోధన అభ్యసన, వనరుల ప్రాముఖ్యతపై మండల గ్రామాల వీఏవోలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. సామాజిక చైతన్య కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎంఈవో దశరథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ
వేడుకల్లో పాల్గొన్న నిర్మలా జగ్గారెడ్డి

● జర్నలిజం ద్వారా ప్రజల్లో చైతన్యం

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో టీజీ ఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి నిర్మలా జగ్గారెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను వారు తిలకించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఫొటోగ్రఫీ జర్నలిజం ద్వారా ప్రజల్లో చైతన్యం పెరుగుతుందన్నారు. ఒక ఫొటోతో మనసులను కదిలించే శక్తిని కలుగుతుందని పేర్కొన్నారు. అనంతరం ఫొటో గ్రాఫర్లు, జర్నలిస్టులను సన్మానించారు.



ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నిర్మలా జగ్గారెడ్డి

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



ఫొటోగ్రాఫర్ ప్రదీప్‌ను సన్మానిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో ఫొటోగ్రాఫర్‌లతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని ఆయా మండలాల్లో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు చోట్ల కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా మండలాల్లో ఫొటోగ్రాఫర్ల సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో కేక్‌లు కట్ చేసి, ప్రతిభ కనబరిచిన ఫొటో గ్రాఫర్లను సన్మానించారు. పలుచోట్ల రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. మెదక్ జిల్లా పౌర సంబంధాల కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఫొటో గ్రాఫర్ ప్రదీప్‌ను కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక ఛాయాచిత్రం వేయి పదాలకు అర్థం చెబుతుందన్నారు. జిల్లాలోని ఫొటోగ్రాఫర్‌లందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా చిన్నశంకరంపేట, చేగుంట, అల్లాదుర్గం, నర్సాపూర్, మండల కేంద్రాల్లో స్థానిక ఫొటో గ్రాఫర్లు ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ డాగురే ఫొటోకు పూలమాలలతో నివాళులర్పించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఫొటో గ్రాఫర్‌లతో కలిసి కేక్ కట్ చేశారు. అదేవిధంగా జిన్నారంలో సీఐ నయిమోద్దీన్, ఎస్ఐ హన్మంతు కేక్ కట్ చేశారు. ఫొటోగ్రఫీతో స్వయం ఉపాధి పొందుతున్న యువకులను సీఐ అభినందించారు. సిర్గాపూర్‌లో ఫొటో గ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు సాయి ఆధ్వర్యంలో ఎస్ఐ మహేష్ కేకు కట్ చేసి ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. నారాయణఖేడ్ పట్టణంలో ఫొటో, వీడియో గ్రాఫర్లు మంగల్‌పేట దుర్గాభవానీమాత ఆలయం నుంచి ఖేడ్ రాజీవ్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ చౌక్‌లో కేక్‌కట్ చేసి ఒకరికొకరు ఫొటోగ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఆశ వర్కర్ల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



చిన్నశంకరంపేట పీహెచ్‌సీలో వైద్యాధికారికి వినతి పత్రాన్ని అందజేస్తున్న ఆశావర్కర్లు

హవేళిఘణపూర్/ చిన్నశంకరంపేట/శివ్వంపేట, ఆగస్టు 19;(ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పలు మండలాల్లో ఆశ వర్కర్లు మంగళవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. మెదక్ జిల్లా హవేళి ఘణపూర్ మండలంలోని సర్ధన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశ వర్కర్లు ధర్నా చేపట్టారు. అనంతరం ఆసుపత్రి అధికారికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ కల్పించాలని, ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్లు నిరసన తెలిపి, వైద్యాధికారి డాక్టర్ సాయిసింధుకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. శివ్వంపేటలో ఆశా వర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు మంగళవారం డాక్టర్ పవన్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

● **జహీరాబాద్:** ఆశావర్కర్లకు కనీస వేతనం కింద నెలకు రూ. 26వేలను ఇస్తూ ఉద్యోగభద్రతను కల్పించాలని ఆశావర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం జహీరాబాద్‌లోని భీంభవన్ ఫంక్షన్‌హాల్‌లో నియోజక వర్గస్థాయి ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశావర్కర్లను ఆదుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

గురుకుల విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

పుల్‌కల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన సింగూరు గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ జ్వరాలకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం పుల్కల్ మండలంలోని మిన్‌పూర్, బస్వాపూర్ గ్రామాల మీదుగా ప్రవహించే సింగూరు కాలువలకు గండ్లు పడిన ప్రాంతాలను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. సింగూరు ఆయకట్టు కాలువల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.

● **అల్లాదుర్గం**: అభారీ వర్షాల కారణంగా మండలంలో దెబ్బతిన్న పంటలను, నీట మునిగిన పంటపొలాలతో పాటు బట్టికుంటకు పడిన గండిని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకొని పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

హల్దీ ఉధృతిలో ముక్కలైన మిషన్ భగీరథ పైపులైన్

● ఐదు గ్రామాలకు నిలిచిన తాగునీరు



వెంకటరత్నాపూర్ వద్ద తెగిన పైపులైన్

తూప్రాన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో హల్దీవాగు ఉధృతంగా ప్రవహించడంతో తూప్రాన్ పట్టణ పరిధి అబోతుపల్లి వద్ద మిషన్ భగీరథ పైపులైన్ ముక్కలైంది. దీంతో నీటి సరఫరా నిలిచిపోయింది. పైపులైన్ ముక్కలతో ఐదు గ్రామాలకు తాగునీటి సరఫరా లేకుండా పోయింది. దీంతో వెంకటరత్నాపూర్, ఇస్లాంపూర్, ఇస్లాంపూర్ తాండా, దాతర్‌పల్లి, స్టేషన్ మాసాయిపేట గ్రామాలకు తాత్కాలికంగా నీటిని సరఫరా చేసేందుకు యత్నిస్తున్నప్పటికీ సుమారు 15 రోజుల్లో సరఫరా అయ్యే అవకాశం కనిపించడంలేదు.

తేరుకోని గాయత్రీనగర్‌కాలనీ



గాయత్రీనగర్‌కాలనీలో నిలిచిన వరదనీరు, వర్షపు నీటిని తొలగించేందుకు పరిశీలిస్తున్న అధికారులు

తూప్రాన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలో కురిసిన భారీ వర్షానికి నీటితో నిండిపోయిన గాయత్రీనగర్‌కాలనీ 36 గంటలు గడిచిపోయినప్పటికీ తేరుకోలేదు. కొత్తచెరువు నిండి నీరు కిందకు రావడంతో గాయత్రీ నగర్‌కాలనీ నీటితో నిండిపోయింది. దీంతో ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితి నెలకొన్నది. సోమవారం ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు ఎక్స్‌కవేటర్, టిప్పర్ సహాయంతో బయటకు వెళ్లారు. మంగళవారం సైతం అదే పరిస్థితి. గాయత్రీనగర్ కాలనీని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈ మధుసూదన్, మున్సిపల్ అధికారులు సందర్శించారు. నీరు తగ్గకపోవడంతో కిందిభాగంలో ఉన్న ఫ్లడ్ కాలువకు సైడ్ తొలగించి నీరు వెళ్లిపోయేవిధంగా ఏర్పాటు చేశారు. అయినా నీరు తగ్గలేదు. మంగళవారం తూప్రాన్ లోతట్టు ప్రాంతాలు, నీటి నిలువ ప్రాంతాలు, పెద్దచెరువు, హల్దీవాగు కాజ్‌వే ప్రాంతాలను తహసీల్దారు. పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారుల బృందం సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.

జహీరాబాద్‌లో అండర్‌బ్రిడ్జిలతో అవస్థలు



రంజోల్-బాబానగర్ రైల్వే అండర్‌బ్రిడ్జికింద నిలిచిన వర్షపునీరు

జహీరాబాద్,ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి):జహీరాబాద్‌లో నిర్మితమైన అండర్‌బ్రిడ్జిలతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని బాబానగర్‌కు చెందిన ప్రజలు రంజోల్ మీదుగ బాబానగర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. ఈ దారిలో రాకపోకలు సాగించాలంటే మధ్యలో రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో వర్షంపడితే మీటరులోతులో వర్షపు నీరు చేరిఆటోలు, ద్విచక్రవాహనాలు వెళ్ళలేని దుస్థితి నెలకొన్నది. బ్రిడ్జికింద వర్షపునీరు తగ్గాలంటే కనీసం గంట పాటు వేచి చూడాల్సిందే. ఎప్పుడు వర్షంకురిసిన బ్రిడ్జివద్ద ఇదే పరిస్థితి ఉందని, గ్రామస్థులు తెలిపారు. మంగళవారం సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ దశరత్‌కు వారు వినతిపత్రం అందజేశారు.

రైతును ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



చేగుంటలో యూరియా కోసం క్యూ లైన్‌లో ఉన్న రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చేగుంట ,ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం చేగుంట లోని శ్రీఆంజనేయ ఆగ్రోసేవా కేంద్రం వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతుల వద్దకు ఎమ్మెల్యే చేరుకుని వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులకు రైతులకు సకాలంలో ఎరువులు అందియ్యకపోతే రైతుల పక్షాన ఆందోళన ధర్నా రాస్తారోకోతో పాటు మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

● **మాసాయిపేట:** రైతులకు పంటలకు వేయాల్సిన యూరియాను సరిపడా అందించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి వ్యవసాయ అధికారులకు సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే లక్ష్మణ్ సునీత రెడ్డి మాసాయిపేటలో యూరియా సర్వరా చేస్తున్న మండల సహకార భవనాన్ని ఆకస్మికంగా సందర్శించి రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఎకరానికి ఒక బస్తా మాత్రమే యూరియాను వ్యవసాయ అధికారులు అందిస్తున్నారని రైతులు ఎమ్మెల్యే వద్ద గోడు వెల్లబోసుకున్నారు.

● **నిజాంపేట:** యూరియా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు రంజిత్ గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం రోజున విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో రైతులకు అందించే యూరియా విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

హల్దీ ప్రాజెక్టును సందర్శించి పూజలు చేసిన సునీతారెడ్డి

మాసాయిపేట ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో మాసాయిపేట మండలం హకీంపేట గ్రామం వద్ద హల్దీ వాగు పై నిర్మించిన హల్దీ ప్రాజెక్టు భారీ వర్షాలతో నిండి అలుగులు పారడంతో మంగళవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హల్దీ ప్రాజెక్టును సందర్శించి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా వెల్దుర్తి మండల పరిధిలోని ఉప్పులింగాపూర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న హల్దీ వాగు బ్రిడ్జి వద్ద ఎమ్మెల్యే సునీతారెడ్డి గంగమ్మతల్లికి పూజలు నిర్వహించారు. వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

●కౌడిపల్లి: కౌడిపల్లి మినీ ట్యాంక్‌బండ్ చెరువు అలుగు పారుతుండటంతో మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చెర్‌పర్సన్ సుహాసినీరెడ్డి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి



అల్లాదుర్గంలో తెగిన బట్టికుంట చెరువుకట్టను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, అధికారులు



నిజాంపేట: మత్తడి దుంకుతున్న చల్మెడ సోమయ్య చెరువు



సంగారెడ్డి జిల్లా కొండాపూర్ పెద్ద చెరువు అలుగు నుంచి పారుతున్న వరదనీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్తయ్య

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి)

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయా జిల్లాల అధికారులు సూచించారు. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లడంతో అధికారులు ప్రభావిత గ్రామాలను సందర్శిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. వరద ఉధృతంగా ఉంటే బ్రిడ్జిలపై నుంచి రాకపోకలు నిలిపివేయాలని సూచిస్తున్నారు. పలు గ్రామాల్లో వర్షాలకు కూలిన ఇళ్లను ఉన్నతాధికారులు పరిశీలించి తక్షణ సాయం కోసం సంబంధిత యంత్రాంగాన్ని ఆదేశించారు. కోహీర్ మండల కేంద్రంలో ఓ పాడుబడిన బోరుబావిలో కూడా నీరు పైకి ఉబికి వచ్చింది. అదేవిధంగా బిలాల్‌పూర్, గొటిగర్‌పల్లి, మనియార్‌పల్లి గ్రామాల్లో కొన్ని బోరుబావుల నుంచి మోటార్ లేకుండానే నీరు పైకి చిమ్ముతున్నాయి. రేగోడు మండలంలో 10 నివాస గృహాలు పాక్షికంగా కూలిపోవడంతో సర్వే చేసి నమోదు చేశామని తహసీల్దార్ దత్తారెడ్డి వివరించారు. అల్లాదుర్గం, రేగోడ మండలాల్లో పర్యటించిన మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. భారీ వర్షాల గండ్లు పడిన చెరువులు, కుంటల మరమ్మతు పనులను యుద్ధపాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. నర్సాపూర్ పరిధిలోని రాయరావు చెరువును మంగళవారం సాయంత్రం తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ సందర్శించి రక్షణ చర్యలను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు.మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని నందిగామ, చల్మెడ గ్రామ శివారులోని చెరువులు మత్తడి దుంకడంతో జడ్పీ సీఈవో ఎల్లయ్య వరదనీటి ప్రవాహాన్ని పరిశీలించారు. చల్మెడ - నిజాంపేట రాకపోకలు పూర్తిగా నిలిపివేయాలని అధికారులకు ఆదేశించారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు: సబ్ కలెక్టర్



ఖేడ్‌లో సబ్ కలెక్టర్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేస్తున్న అంగన్‌వాడీలు

నారాయణఖేడ్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): విధుల పట్ల వహించొద్దని అంగన్‌వాడీ టీచర్లను ఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి సూచించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఉమా హారతిని మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఖేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి ఆమె ఫోటోతో ఉన్న జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల సంఘం బాధ్యులు వీణాకుమారి, నిర్మల, విద్యావతి, పుణ్యవతి, రాధ, సంగీత, జ్యోతి, రుక్మిణీ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నల్లవాగు నీటిని సద్వినియోగం చేసుకోవాలి



సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

● కల్హేర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నల్లవాగు ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా విడుదల చేసిన నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పి. సంజీవరెడ్డి సూచించారు. సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టును మంగళవారం ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత రెండు రోజుల నుండి కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటితో నిండిపోవడంతో సోమవారం కుడి, ఎడమ కాలువల ద్వారా ఆయకట్టు భూములతో పాటు పరివాహకంలోని చెరువుల్లోకి నీరు విడుదల చేయించామన్నారు.

అక్రమ మైనింగ్‌లపై చర్యలు తీసుకోండి

కంది, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మంత్రిగారూ... సంగారెడ్డి... జిల్లా కంది మండలంలోని ఎర్దనూర్, బ్యాతోల్ శివార్లలోని అక్రమ మైనింగ్ పై చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని ఎర్దనూర్ గ్రామస్తులు రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని అభ్యర్థించారు. మంగళవారం హైదరాబాద్ లోని మంత్రి కార్యాలయంలో ఆయనను ఎర్దనూర్ గ్రామస్థులు మర్యాదపూర్వకంగా కలసి అక్రమ మైనింగ్ వ్యవహారంపై వినతిపత్రం అందజేశారు. తమ గ్రామ శివార్లలో అసైన్డ్ భూములను ఆక్రమించుకుని దౌర్జన్యంగా కొందరు అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడుతన్నారని మంత్రికి పిర్యాదు చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్తులు తెలిపారు మంత్రిని కలిసిన వారిలో దుర్గాప్రసాద్, ప్రవీణ్, బాలయ్య, బంగార్రాజు తదితరులు ఉన్నారు.

కోహీర్ మండలంలో జ్వరాలతో జనాలు విలవిల

కోహీర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ముసురు వర్షాలతో వాతావరణంలో మార్పులు వచ్చి జనాలు జ్వరాలతో బాధపడుతున్నారు. ఒళ్ళు నొప్పులతో చాలామంది ప్రజలు ఆస్పత్రులకు వెళ్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జనాలు చికిత్సల కోసం బారులు తీరుతున్నారు. దిగ్వాల్, బిలాల్‌పూర్ పీహెచ్‌సీలో 5 రోజుల్లో 1470మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు ప్రస్తుతం మండలంలో 100 మందికి పైగా జ్వరాలకు గురయ్యారు. 11 మందికి డయేరియా సోకింది. వీరందరికీ రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● **అల్లాదుర్గం:** కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని, అప్రమత్తంగా ఉండాలంటూ అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సారిక సూచించారు. మంగళవారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో ఇంటింటా సర్వే చేసి అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలకు పలు సలహాలు సూచనలను ఇచ్చారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. నీటిని వేడి చేసుకొని తాగాలన్నారు.

● మనోహరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గౌతోజీగూడ గ్రామంలో సీఎంఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జీఎమ్ఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆసుపత్రి వైద్యులు ఉచిత శిబిరం నిర్వహించారు. గ్రామంలో పెద్దలు, గ్రామస్తులు, ఇతర ఆరోగ్య టెస్టులు, చేసుకోని మందులు పంపిణీ చేశారు. వర్షాకాలం దృష్య రోగులు తగిన పరిశుభ్రత తీసుకోవాలని, ఇంటి ఆవరణలో ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి: ఐకేపీ డీపీఎం

పెద్దశంకరంపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఐకేపీ డీపీఎం వెంకటేశం అన్నారు. మంగళవారం పెద్దశంకరంపేటలోని శ్రీనిధి భవనంలో నిర్వహించిన మహిళ సమైక్య వార్షిక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘాల ద్వారా మహిళలు బ్యాంకు నుంచి రుణాలు తీసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. స్త్రీనిధి ద్వారా సైతం మహిళలు రుణాలను తీసుకోవచ్చని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్ గంగారాం, ఐకేపీ ఏపీఎం అశోక్, సీసీలు నిరంజన్, యేహాన్, బాబురావు, వీరాచారి, మహిళా సంఘాల బాధ్యులు మహిళలు పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట : చందంపేట రోడ్డుపై కుంగిన బ్రిడ్జి

తడిసిముద్దయిన మెతుకుసీమ

(5వ పేజీ తరువాయి)

జలమయమయ్యాయి. వరదలతో వరి పంటలు నీట మునిగాయి. తహసీల్దార్ కార్యాలయం ఉరుస్తుండంతో ఫైళ్లన్నీ తడిసి ముదయ్యాయి. ఉరుస్తున్న చోట్ల సిబ్బంది టబ్‌లు, బేసిన్లు పెట్టారు. చిన్నశంకరంపేట మండలంలోని చందంపేట, రుద్రారం గ్రామాలకు వెళ్లే రోడ్డుపై బ్రిడ్జి కుంగింది. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

జలదిగ్బంధంలో మూడు గ్రామాలు

టేక్మాల్ మండల పరిధిలోని పల్వంచ, ధనురా, కోరంపల్లి గ్రామాలు జలదిగ్బందంలో చిక్కుకున్నాయి. గుండువాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో టేక్మాల్‌కు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. గోనెమ్మచెరువు అలుగు పారడంతో జోగిపేటకు రాకపోకలు నిలిచిపోయాయి.

నల్లవాగు ప్రాజెక్టు కుడి కాలువకు గండి

కల్హేర్ మండల పరిధిలోని బీబీపేట జంలా తండా సమీపంలో నల్లవాగు కుడి కాలువకు మంగళవారం గండి పడి నీరు వృథాగా పోయింది. ఈ కాలువ గుండా నీటిని విడుదల చేయడంతో ఉధృతికి కట్ట తెగిపోయింది. దీంతో పంట పొలాలు పూర్తిగా నీట మునిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే గండిని పూడ్చి వేయించాలని కోరారు.